సాక్షి మెదక్

గురువారం । 28 । డిసెంబర్ । 2023



డ్రగ్స్ తయారీ ముఠా అరెస్ట్

నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్స్ తయారు చేస్తున్న నలుగురు నిందితులను సంగారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాలు 8లో ▸



బోసిపోయిన ఆర్డీవో కార్యాలయం

రెవెన్యూ డివిజన్ కార్యాలయం అధికారికంగా 85 రోజుల క్రితం కార్యాలయం ప్రారంభించారు. కానీ ఇంతవరకు సిబ్బంది నియామకాలు కాలేదు.

వివరాలు 9లో ▸



అర్థమయ్యే రీతిలో బోధించాలి

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి విశ్వనాథం సూచించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు చల్లపల్లికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక



దామోదర రాజనర్సింహ

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ టేక్మాల్ మండలంలోని చల్లపల్లి గ్రామానికి గురువారం రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్ బుధవారం తెలిపారు. మంత్రి కార్యక్రమం బొడ్మట్‌పల్లిలో ఉండగా షెడ్యూల్ ప్రకారం చల్లపల్లికి మార్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీరప్పకు హరీశ్‌రావు పరామర్శ



వీరప్పను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

టేక్మాల్(మెదక్): బీఆర్ఎస్ పార్టీ టేక్మాల్ మండల అధ్యక్షుడు భిక్షల వీరప్ప తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు భిక్షల శివప్ప మృతి బాధాకరమని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం టేక్మాల్‌లో శివప్ప చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరప్ప, మాజీ సర్పంచ్ భిక్షల వరలక్ష్మితో మాట్లాడి ఓదార్చారు. తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, రాష్ట్ర నాయకుడు అనిల్‌కుమార్, మఠం భిక్షపతి, బాలయ్య, మాణిక్యం, నారాయణ, దేవేందర్‌రెడ్డి, కాశీనాథ్, ఎంపీపీ స్వప్నరవి, సర్పంచ్‌లు సుప్రజాభాస్కర్, గోపాల్, సంగయ్య, నారాయణ, పార్టీ మండల నాయకులు సలీమ్, సిద్దయ్య, భాస్కర్, మహేందర్, బసంత్‌రావ్, సర్దార్, సల్లాఉద్దీన్, సాయిలు, నాగరాజు తదితరులు ఉన్నారు.

రాజిరెడ్డి కుటుంబ సభ్యులతో..

పాపన్నపేట(తూప్రాన్): మండలంలోని యూసుఫ్‌పేట్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన రాజిరెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పరామర్శించారు. రాజిరెడ్డి కుమారుడు మధుసూధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డిని ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రాజీనే రాజమార్గం

జూనియర్ సివిల్ జడ్జి అనిత



మాట్లాడుతున్న న్యాయమూర్తి అనిత

నర్సాపూర్‌రూరల్: కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత అన్నారు. బుధవారం మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులతో మాట్లాడారు. ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయగలిగే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. దానికి పోలీస్ అధికారులు, బ్యాంకు అధికారులు కక్షిదారులకు సహకారాన్ని అందించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న మోటార్ వెహికల్స్ ఈ చల్లాన్‌లను ఆన్‌లైన్ ద్వారా చెల్లించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాలకు వెళ్లకుండా విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ రాధాకిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. మనోహరాబాద్ మండలం పాలట పాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేస్తున్న జి.వెంకటకృష్ణారెడ్డి నాలుగు నెలల క్రితం చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చారు. కాని ఆయన నాలుగు నెలలుగా విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయంపై ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో డీఈఓకు ఫిర్యాదు అందింది. విచారించి ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులకు కూడా షోకాజ్ నోటీసులు అందించారు.

వెన్నుపోట్లు.. కత్తిపోట్లు..

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ ఏడాది రాజకీయాలు రసవత్తరంగా సాగాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీల మధ్య నువ్వా.. నేనా అన్నట్లుగా సమరం సాగింది. చివరకు గులాబీ గుబాళింపుతో పట్టునిలుపుకోగా.. కాంగ్రెస్ తన బెట్టు నిలుపుకొంది. ఉమ్మడి జిల్లాలో ఏడు చోట్ల బీఆర్ఎస్ విజయం సాధించగా.. నాలుగుచోట్ల గెలిచి కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకుంది. రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు దక్కాయి. అందోల్ నుంచి దామోదర రాజనర్సింహకు, హుస్నాబాద్‌లో గెలుపొందిన పొన్నం ప్రభాకర్‌కు అమాత్య పదవులు వరించాయి. గతంలో సీఎం కేసీఆర్ మంత్రిగా పనిచేసిన రవాణాశాఖ ఈసారి పొన్నంకు దక్కడం గమనార్హం.



వివరాలు 8లో ▸

నేటి నుంచి సిటీ పోలీసు యాక్టు

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో గురువారం నుంచి సిటీ పోలీసు యాక్టు అమలులో ఉంటుందని కరీంనగర్ సీపీ, సిద్దిపేట ఇన్‌చార్జి సీపీ అభిషేక్ మహంతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే జనవరి 4వ తేదీ వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయన్నారని తెలిపారు. ఈ సమయంలో ముందస్తు పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సూచించారు. అదే విధంగా సౌండ్ వినియోగంపై ఉన్న నిబంధనలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

మంచు ముప్పు

- వారం రోజులుగా మరింత తీవ్రం
- తరుచు రోడ్డు ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కాలుష్యమే కారణమా!

మెదక్: గతంలో ఎప్పుడూ లేని విధంగా జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. దాని ప్రభావంతో ప్రజలు గజగజా వణుకుతున్నారు. ఉదయం తొమ్మిది దాటినా మంచు వీడడంలేదు. దీంతో పిల్లలు, వృద్ధులు ఇంటికే పరిమితమవుతున్నారు. ఇక వాహనదారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక చాలా చోట్ల తరుచు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వారం రోజులుగా ఈ పరిస్థితి మరీ తీవ్రంగా మారింది. జిల్లాలో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఒక్కప్పుడు ఢిల్లీలో పొగమంచుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వినేవాళ్లం కానీ ఇప్పుడు ఇక్కడ కూడా కళ్లారా చూస్తున్నాం.

కాలుష్యమే కారణమా?..

దీనికి కారణం ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యమా? లేక అడవులు తగ్గడమా? మరేమైనా వాతావరణ మార్పులో తెలియడంలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్ల లేనంతగా పొగమంచు కమ్ముకుంటోందని ప్రజలు వాపోతున్నారు. ఉదయం 9.30 గంటల వరకు మంచు వీడడంలేదు. ఫలితంగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపంచక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గత 26న పెద్దశంకరంపేట మండల పరిధిలోని సంగారెడ్డి–మద్నూర్ 161 జాతీయరాహదారిపైగల కోళ్లపల్లి ప్రాంతంలో ఉదయం 8 గంటల మంచు కమ్ముకోవడంతో బొలేరో వాహనం డివైండర్‌ను ఢీకొట్టింది. దీంతో వాహనంలో ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే 26న చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన ఓ రైతు తన ద్విచక్రవాహనంపై ఉదయం 7 గంటలకు పొలం వద్దకు వెళ్తుండగా ఒక్కసారి పొగమంచు కమ్ముకోవడంతో రోడ్డుపై ఉన్న గుంతలో పడి గాయపడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. అలాగే 15 రోజులు క్రితం చిన్నశంకరంపేట మండలం మెదక్–చేగుంట ప్రధాన రహదారి అంబాజిపేటపై ఉదయం 6 గంటలకు ఎదురెదురుగా వచ్చిన బైక్–కారు ఢీకొన్న ఘటనలో బైక్‌పై ఉన్నవ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఇలా నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీని వల్లా మార్నింగ్ వాకర్లు, పాల వ్యాపారులు, పేపర్‌బాయ్స్, పారిశుధ్య కార్మికులు, కూరగాయల రైతులు ఈ పొగ మంచుతో నానాఅవస్థ పడుతున్నారు.



మెదక్, చేగుంట రోడ్డు వద్ద పొగమంచు (ఫైల్)

పొగ మంచుతో ప్రమాదం..



దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులైన ఆస్తమా, బీపీ, షుగర్, గర్భిణులు, వృద్ధులు, చిన్న పిల్లలు ఈ పొగమంచులో బయటకు వెళ్లడం ప్రమాదకరం. ఆస్తమా పేషెంట్లు ఈ పొగమంచుతో కూడిన గాలిని పీలిస్తే వెంటనే నిమోనియాకు గురయ్యే అవకాశం ఉంది. నిర్లక్ష్యంచేస్తే ప్రాణాలకే ముప్పు. అలాగే చిన్న పిల్లలు, గర్భిణులు, మహిళలు, ఇతర దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు పొగ మంచును పీల్చితే వారి శరీరంలో వెంటనే మార్పులు చోటు చేసుకుని అనేక రకాల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉంది. ఈ పొగ మంచులో ఎట్టి పరిస్థితుల్లో బయటకు వెళ్లొద్దు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్ మెదక్

ప్రజా పాలనకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మొదటిరోజు 80 గ్రామాలు, 11 వార్డుల్లో
- మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

మెదక్: ప్రజాపాలన కార్యక్రమానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. సంక్షేమ పథకాలపై 9 రోజుల పాటు కొనసాగే దరఖాస్తుల స్వీకరణకు గురువారం శ్రీకారం చుట్టనున్నారు. మెదక్ జిల్లాలో 21 మండలాలు ఉండగా, 469 పంచాయతీలతో పాటు 4 మున్సిపాలిటీలు, 75 వార్డులు ఉన్నాయి. మొదటి రోజు 80 పంచాయతీల్లో 11 మున్సిపాలిటీలలో ఈ దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. జిల్లాలో మొత్తం 49 టీమ్‌లతో 2294 కౌంటర్లు ఏర్పాటు చేసి అర్జీలు తీసుకుంటారు. జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిధిలోను ప్రత్యేక అధికారులను నియమించారు.

టేక్మాల్(మెదక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమానికి అన్ని రకాల ఎర్పాట్లను పూర్తి చేసినట్లు ఎంపీడీఓ రియాజుద్దిన్ తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలంలోని చల్లపల్లి గ్రామంలో తహసీల్దార్ కృష్ణతో కలిసి ప్రజా పాలన కార్యక్రమానికి ఎర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ... 28న చల్లపల్లి గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వస్తున్నారని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ప్రభుత్వ ఆరు గ్యారంటీలపై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. వారి వెంట సర్పంచ్ గోపాల్, ఏఎస్ఐ తుక్కయ్య, కార్యదర్శి నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

నోడల్ అధికారిగా సంగీత

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం అమలు తీరును, జిల్లా స్థాయిలో పరిశీలించేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంగీతను నియమించారు. ఉమ్మడి జిల్లాలో ప్రజా పాలన సభల నిర్వహణ తీరును పరిశీలిస్తూ.. ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగేలా కృషి చేయనున్నారు.

ఆర్థిక ప్రగతికి తోడ్పాటు

- ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలి
- ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశంలో మంత్రి కొండా సురేఖ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: పేదల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. అభయ హస్తం గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందన్నారు. అధికార యంత్రాంగం జవాబుదారీ తనంతో పనిచేసి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో సహకరించాలన్నారు. బుధవారం సాయంత్రం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజాపాలన సన్నాహక సమావేశం జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్బంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువచేస్తూ, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ఆయా పథకాల కోసం లబ్ధిదారుల దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు.

ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశామన్నారు. మిగిలిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పకడ్బందీగా జరగాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అడిగిన సందేహాలను మంత్రి నివృత్తి చేశారు.

ఇచ్చిన స్థలాలకే సర్టిఫికెట్లు ఇచ్చారు

నారాయణఖేడ్ నియోజకవర్గంలో గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇచ్చిన నివాస స్థలాలకే గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కొత్తగా ఇంటి పట్టాలు ఇచ్చిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సమావేశంలో ప్రస్తావించారు. కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇంటి స్థలాల భూములను ధరణిలో పట్టాభూములుగా రికార్డు చేయడంతో నిరుపేదలు అనేక ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచితమంటూ ఉన్న బస్సులను రద్దు చేశారు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలులో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డి – పటాన్‌చెరు రూట్‌లో పది బస్సులుంటే, అందులో ఆరు బస్సులను తొలగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఓటమి చిన్న బ్రేక్ మాత్రమే..

- 412 హామీలతో కాంగ్రెస్ గెలుపు
- కార్యకర్తలు ప్రజాగొంతుకై ఉండాలి
- తెలంగాణతో తల్లీబిడ్డల బంధం
- పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం
- మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్: ఈ ఓటమి చిన్నబ్రేక్ మాత్రమే.. స్పీడ్ బ్రేకర్ వస్తే మనం కొంచెం ఆగుతాం.. ఇది కూడా అలాంటిదే.. అంతమాత్రాన దిగాలు పడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం మెదక్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మెదక్, హవేళీఘనాపూర్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు 412 హామీలిచ్చి గెలుపొందారని, రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో ఇప్పటికే సగం వరినాట్లు అయ్యాయని ఇప్పటికీ రైతుబంధు వేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పుడే వ్యవసాయానికి సరైన విద్యుత్ ఇవ్వడంలేదని, ముందు ముందు ఇస్తారా లేదా అనే ఆందోళనలో అన్నదాతలు ఉన్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తే వారిని ప్రజా క్షేత్రంలోనే నిలదీయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే వారిపై ప్రజలు తిరగబడే రోజులు వస్తాయని, బీఆర్ఎస్ కార్యకర్తలు ఎల్లప్పుడు ప్రజల గొంతుకై ఉండాలని కోరారు. ప్రత్యేక రాష్ట్రం కోసం మనం కొట్లాడామని, తెచ్చుకున్న తెలంగాణను పదేళ్లల్లో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామన్నారు. మనది తెలంగాణ ప్రజలతో విడదీయరాని పేగు బంధమైతే ఇతర పార్టీలది రాజకీయబంధం అన్నారు. కాళేశ్వరం, కొండపోచమ్మల ప్రాజెక్టుల మూలంగా మెదక్ జిల్లాలో మండే వేసవిలోనూ మత్తళ్లు దుముకుతున్నాయని పేర్కొన్నారు. హల్దీప్రాజెక్టు వేసవిలోను నిండుకుండలా పారుతున్న విషయాన్ని గుర్తుకు చేశారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ మెదక్ జిల్లాలోని ప్రతి గ్రామానికి రూ.15 లక్షల చొప్పున జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు సైతం విడుదల చేశారని వాటితో జిల్లాను అభివృద్ధి చేయాలన్నారు. రామాయంపేటను రెవెన్యూ డివిజన్, మెదక్ ఎంసీహెచ్ ఆస్పత్రిని 100 పడకలతో నిర్మించామని, అందువల్ల 90 శాతం ప్రసవాలు అక్కడే జరుగుతున్నాయన్నారు. కరోనాతో రెండేళ్ల పాటు సతమతమైనా రైతుబంధును ఆపకుండా ఇచ్చామని, అలాగే విద్యుత్ 24 గంటలూ సరఫరా చేశామని చెప్పారు. ఓటమికి కారణాలను బేరీజు వేసుకుని ముందుకు సాగుదాం అన్నారు. బీసీ, దళిత బంధుతో కొంత మేర ఇబ్బందులు కలిగినట్లు కార్యకర్తలు చెప్పారని, వాటిని పరిగణలోకి తీసుకుని రాబోయే రోజుల్లో లోటుపాట్లు లేకుండా ముందుకు సాగుదాం అన్నారు. కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళనకు గురికావద్దని ఎల్లప్పుడు మీకు అండగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, గ్రంథాలయ చైర్మెన్ చంద్రారెడ్డి, మ్యాడం బాలకృష్ణ, మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్లన్లు చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, జెడ్పీ వైస్ చైర్మెన్ లావణ్యరెడ్డి, మామిళ్ల ఆంజనేయులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

దరఖాస్తుల స్వీకరణపై అవగాహన

మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలన కార్యక్రమంలో ప్రజలకు దరఖాస్తులు అందజేయడం, తిరిగి వాటిని స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డులలో ప్రజాపాలనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం వార్డు సభల నిర్వహణపై బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ, వైద్య, ఆరోగ్య, విద్య, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించారు. వార్డు సభలో పాల్గొనే ప్రజలకు దరఖాస్తులు అందజేయడం వాటిని నింపడం, అనంతరం ప్రజల నుంచి స్వీకరించే అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. వార్డు సభలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమం ప్రారంభోత్సవం రోజు పట్టణంలోని హన్మంతాపూర్‌లో 28 ఉదయం 8 గంటలకు వార్డు సభ ఏర్పాటు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. అనంతరం రోషిణి స్కూల్ వద్ద, రెండో వార్డులో ఎస్టీఓస్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో వార్డు సభ ఏర్పాటు చేస్తామని, ప్రజలు పాల్గొని ప్రభుత్వ పథకాలు పొందేందుకు దరఖాస్తు ఫారాలు నింపి తమ సిబ్బందికి అందజేయాలని వెంకట్‌గోపాల్ కోరారు. సన్నాహక సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్ కుమార్, ఏడీఈ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ ఫైజల్, మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్

ఇబ్బందులు కలగకుండా చూడాలి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు ఆరు గ్యారంటీలపై జరిగే గ్రామసభలో ప్రజలకు ఇక్కట్లు కాకుండా దరఖాస్తులు స్వీకరించాలని మండల ప్రత్యేక అధికారి నర్సింలు అన్నారు. బుధవారం మనోహరాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలనపై ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, అధికారులు అందజేసిన దరఖాస్తులు నింపి గ్రామసభలలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు నత్తి మల్లేశ్, నరేందర్‌రెడ్డి, నాగభూషణం, నర్సింలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలు

- ఓటరు నమోదుకు సహకరించాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో లోక్‌సభ ఎన్నికలకు జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల కసరత్తులో భాగంగా బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, జిల్లాలో జనాభా ప్రాతిపదికన పోలింగ్ కేంద్రాల పెంపు లాంటి అంశాలపై నాయకుల అభిప్రాయం పరిగణలోకి తీసుకుంటామన్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024పై రాజకీయ పార్టీల నేతలు తమ అభిప్రాయాన్ని తెలపాలని సూచించారు. జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి 5 వరకు నమోదు 6న ముసాయిదా ఓటరు జాబితా విడుదల, జనవరి 22 వరకు అభ్యంతరాల స్వీకరించి, ఫిబ్రవరి 2వ తేదీలోగా పరిష్కరించి, ఫిబ్రవరి 8న తుది జాబితా వెలువరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్, బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు శ్రీనివాస్, నర్సింలు, ఆంజనేయులుగౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

క్లుప్తంగా

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



రాజేష్‌కు మెమెంటో అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని మర్పడ్గ హైస్కూల్ విద్యార్థి రాజేష్ బేస్ బాల్ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారని హెచ్‌ఎం. భైరయ్య తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు మహబూబాబాద్ (తొర్రూర్) లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బేస్ బాల్ రాష్ట్ర స్థాయి క్రీడలను నిర్వహించారు. అండర్ 14 విభాగంలో రాజేష్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు ఎంపికయ్యేలా శిక్షణ నిచ్చిన పీఈటీ తోట సతీశ్‌ను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి,ఎస్‌జీఎఫ్ జిల్లా రామేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి హెచ్‌ఎం భైరయ్యలు ప్రత్యేకంగా అభినందించారు. రాజేష్‌క మెమొంటో అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, గీత, మమత, ఉమాదేవి, రంగారావు, అంజయ్య, కల్పవల్లి శ్రీనివాస్, రాజేందర్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



మానసను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): జాతీయస్థాయి ఖోఖో పోటీలకు మర్వెల్లి ఉన్నత పాఠశాలకు చెందిన టీ.మానస (8వ తరగతి) ఎంపికైనట్లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం పీ.నాగిరెడ్డి తెలిపారు. ఇటీవల కొమురంభీమ్ జిల్లా ఆసీఫాబాద్‌లో మూడు రోజులపాటు జరిగిన అండర్–14 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో మానస ప్రాతినిధ్యం వహించి అత్యుతమ ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయిపోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. మానసను పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు. ఉపాధ్యాయులు సాయిలీల, నాసర్, విజయరావు, పీఈటీ మహేశ్, అవకుశం, శ్రీదేవి, జైపాల్, శివకుమార్, సరిత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు




విద్యార్థులతో ప్రిన్సిపాల్ మధుసూదన్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అండర్–17 జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో గురుకుల పాఠశాలకు చెందిన శివకుమార్, పుడ్లిక్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు హయత్‌నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో శివకుమార్, పుడ్లిక్ పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆకాంక్షించారు.

వెన్నుపోట్లు.. కత్తిపోట్లు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆసక్తికర రాజకీయం

- కాంగ్రెస్‌కు పెరిగిన ఎమ్మెల్యేల బలం
- పట్టు నిలుపుకున్న బీఆర్‌ఎస్ పార్టీ..
- ఈసారి కేబినేట్‌లో ఉమ్మడి జిల్లాకు రెండు బెర్తులు
- ప్రచారంలో కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి
- స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల రగడ..



ఈ ఏడాది ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ఇటీవల జరిగిన హోరాహోరీగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోనూ తన బలాన్ని పెంచుకుంది. ఈసారి రెండు మంత్రి పదవులు కూడా దక్కడం గమనార్హం. బీఆర్‌ఎస్ పార్టీ కూడా తన పట్టును నిలుపుకుంది. బీజేపీ ఈసారి ఉన్న ఒక్క ఎమ్మెల్యే స్థానం కూడా కోల్పోయింది. పలు పార్టీ నేతలు ఒక పార్టీ నుంచి మరోపార్టీకి మారడం పోటీలో నిల్చున్న అభ్యర్థులు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం చూశాం. ఎమ్మెల్యేగా బరిలో నిలిచిన కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన కత్తిదాడి రాష్ట్రంలో సంచలంగా మారింది.

– సాక్షిప్రతినిధి, సంగారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రేసులోకి వచ్చింది. 11 అసెంబ్లీ స్థానాలకు నాలుగు ఎమ్మెల్యే సీట్లను గెలుచుకొని నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. అందోల్, నారాయణఖేడ్, మెదక్, హుస్నాబాద్‌లలో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. అంతకు ముందు కేవలం ఒక్క సంగారెడ్డిలోనే కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించింది. బీఆర్‌ఎస్ కూడా ఏడు చోట్ల విజయం సాధించింది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నర్సాపూర్, గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక స్థానాల్లో గులాబీ జెండా రెపరెపలాడింది.

'స్థానిక'ంలో అవిశ్వాసాల జోరు..

స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల రగడ ఈ ఏడాదే షురువైంది. మున్సిపాలిటీలు, సహకార సంఘాల చైర్మన్ పదవులపై సభ్యులు అవిశ్వాస తీర్మాణాల నోటీసులు ఇచ్చారు. సంగారెడ్డి, అందోల్, సదాశివపేట్, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెడుతూ కౌన్సిలర్లు నోటీసులు ఇచ్చారు. ఎన్నికల ముందు ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే ఆయా చైర్మన్లు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అవిశ్వాసాల రగడం కొన్ని నెలలు సద్దుమనిగింది. ఎన్నికల అయిన వెంటనే మళ్లీ బల్దియాల్లో అవిశ్వాసాల లొల్లి షురువైంది. ఈసారి రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ అవిశ్వాసాల తీర్మాణాలు నెగ్గుతాయా? లేదా? అనే దానిపై కొత్త సంవత్సం 2024లో తేలనుంది.

రెండు మంత్రి పదవులు..



కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు దక్కాయి. అందోల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సిలారపు దామోదర రాజనర్సింహకు అమాత్య పదవి వరించింది. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట నుంచి ప్రాతినిధ్యం వహించిన హరీశ్‌రావు మంత్రిగా కొనసాగిన విషయం విధితమే. అయితే మాజీ మంత్రి హరీశ్ రావు పోర్టు పోలియో వైద్యారోగ్యశాఖ ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహకు దక్కడం గమనార్హం. ఉమ్మడి జిల్లా నుంచి సీఎం పదవి చేజారిపోయింది. గజ్వేల్ నుంచి రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం వహించిన కేసీఆర్ ఇప్పుడు బీఆర్‌ఎస్‌ఎల్పీ నేతగా కొనసాగే అవకాశాలున్నాయి. రెండు చోట్ల పోటీ చేయగా గజ్వేల్‌లో గెలిచారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పొన్నం ప్రభాకర్‌కు క్యాబినేట్‌లో చోటు దక్కింది. గతంలో సీఎం కేసీఆర్ మంత్రిగా పనిచేసిన రవాణాశాఖ ఈసారి పొన్నంకు దక్కడం గమనార్హం.

పార్టీలు మారిన నేతలు..

ఎన్నో ఏళ్లుగా ఆయా పార్టీల్లో కొనసాగిన నేతలు ఈ ఏడాది జరిగిన ఎన్నికల వేళ పార్టీలు మారారు. రాత్రికి రాత్రే కండువాలు మర్చారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి ఎక్కువ మంది నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలు మారిన ముఖ్యనేతల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా ఉన్న గాలి అనిల్‌కుమార్, మెదక్ డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, జహీరాబాద్‌కు చెందిన నరోత్తం, టీపీసీసీ కార్యదర్శి మ్యాడం బాలకృష్ణ వంటి నాయకులంతా ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌ను వీడారు.



కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ (ఫైల్)

ఉన్న ఒక్క స్థానాన్ని కోల్పోయిన బీజేపీ



గత ఎన్నికల్లో దుబ్బాక నుంచి గెలుపొందిన బీజేపీ నేత రఘునందన్‌రావు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో ఆ పార్టీకి ఉన్న ఒక్క ఎమ్మెల్యే స్థానం కోల్పోవాల్సి వచ్చింది. 2020లో జరిగిన ఉప ఎన్నికల్లో రఘునందన్‌రావు బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన విషయం విదితమే. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలైన విషయం విదితమే. ఒకరిద్దరు మినహా మిగిలిన అందరికి కనీసం డిపాజిట్లు రాకపోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజల్లో కనీసం పట్టులేని అభ్యర్థులను బరిలోకి దించడంతో కనీసం వార్డు కౌన్సిలర్‌కు వచ్చే ఓట్లన్ని కూడా ఆయా నియోజకవర్గాల్లో సాధించలేకపోయింది.



కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తిదాడి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం

దుబ్బాకటౌన్ : అక్టోబర్ 30న మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న అప్పటి మెదక్ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దుండగుడు కత్తితో దాడి చేయడంతో ఆయన తీవ్ర గాయాలయ్యాయి. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నియోజకవర్గంలోని సూరంపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి దగ్గరికి నమస్తే సార్ అంటు మిరుదొడ్డి మండలం చేప్యాలకు చెందిన గటాని రాజు వచ్చి ఒక్కసారిగా కత్తితో పొడిచాడు. వెంటనే అక్కడున్న పోలీసులు, ప్రజలు రాజును పట్టుకొని దేహశుద్ధి చేశారు. కత్తి దాడిలో గాయపడ్డ ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సమయంలో సంచలనంగా మారింది. కత్తి దాడిలో గాయపడ్డ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక అంబులెన్స్‌లో డాక్టర్ల పర్యవేక్షణలో దుబ్బాకకు వచ్చి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్న ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా 53 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

డ్రగ్స్ తయారీ ముఠా అరెస్ట్

- రూ.70 లక్షల విలువ చేసే ఆల్ఫాజోలం సీజ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్



డ్రగ్స్ తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

సంగారెడ్డి : నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్స్ తయారు చేస్తున్న ప్రాంతాల్లో సంగారెడ్డి పోలీసులు దాడులు నిర్వహించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులకు సంబంధించి వివరాలను జిల్లా ఎస్పీ రూపేశ్ మంగళవారం వెల్లడించారు. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్ పేటకు చెందిన కమల బ్రహ్మానందగౌడ్ (46), పటాన్‌చెరు శాంతినగర్‌కు చెందిన చిరుగోరి డేవిడ్ (59), జహీరాబాద్ మండలం రాయపోలుకు చెందిన ఫార్మా కంపెనీ ఉద్యోగి కొండాపురం శివ (28), సంగారెడ్డి మండలం పసల్‌వాడి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ (36) నలుగురు స్నేహితులు. సంగారెడ్డి శివారులోని పసల్‌వాడి గ్రామంలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. మార్కెట్‌లో లభించే మధ్యవర్తిత్వ రసాయనాలను సేకరించి ఆల్ఫాజోలం డ్రగ్స్ తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. వ్యాపారానికి సాయం చేయడానికి, ఎప్పటికప్పుడూ యూనిట్‌ను పర్యవేక్షించడానికి స్థానిక నివాసి వినోద్‌కుమార్‌ను నియమించుకున్నారు. పసల్‌వాడీ గ్రామ పరిసర ప్రాంతాల్లో అనుమానిత, రహస్య కార్యకలాపాలు జరుగుతున్నాయని అందించి సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.70 లక్షలు విలువ చేసే ఆల్ఫాజోలం డ్రగ్స్, యూనిట్ సామగ్రి, వాహనాలు, ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. సమావేశంలో డీఎస్పీ రమేశ్ కుమారు, సీఐలు రమేశ్, శివలింగం పాల్గొన్నారు.

మీకూ స్వేచ్ఛ వచ్చింది

- గతంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్టేజి మీద మాట్లాడేవారు కాదు
- మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ప్రజాపాలన కార్యక్రమం ఉమ్మడి మెదక్ జిల్లా సన్నాహక సమావేశంలో ఆసక్తికరమైన సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. సాధారణంగా రాజకీయ పార్టీల సభలు సమావేశాల్లో కార్యకర్తలు, నాయకులు చప్పట్లు కొడుతుంటారు. కానీ బీఆర్‌ఎస్ పాలన తీరును జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ విమర్శిస్తుండగా.. అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు.. ఇలా ఉమ్మడి జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం చప్పట్లు కొట్టడం తీవ్ర చర్చనీయాశంగా మారింది. డబుల్‌బెడ్రూం ఇళ్లు పొందిన లబ్ధిదారులకు ప్రస్తుతం రేషన్‌కార్డులు లేవని, వాటి పరిస్థితి ఏంటని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కొండా సురేఖ బదులిస్తూ.. బీఆర్‌ఎస్ హయాంలో రేషన్‌కార్డులు లేనివారికి డబుల్‌బెడ్రూం ఇళ్లు ఎలా కేటాయించారని ఎదురు ప్రశ్నించారు. ఈ సందర్భంలోనూ అధికారులు చప్పట్లు కొట్టడం ఆసక్తికరంగా మారింది.

బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకూ..

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ వచ్చిందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజాపాలన సన్నాహక సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో స్టేజి మీద బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులువెవ్వరూ మాట్లాడే వారు కాదని.. ఇప్పుడే ఫస్ట్‌టైం మాట్లాడుతున్నారని మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాగే, అధికారుల పనితీరును బట్టే పదోన్నతులు, బదిలీలు ఉంటాయని అన్నారు. ఆయా అధికారుల పనితీరుపై ఎప్పటికప్పుడూ ఇంటెలిజెన్స్ రిపోర్టు ప్రభుత్వానికి అందుతుందన్నారు. ప్రజల మెప్పు పొందేలా పని చేయాలని విజ్ఞప్తి చేశారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతారెడ్డి, తదితరులు

క్రేన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ఆటో డ్రైవర్ లాలూ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్) : కిరాయితో వెళ్తున్న ఆటో.. దారి మధ్యలో మొరాయించడంతో మెకానిక్ కోసం రోడ్డు దాటుతున్న ఆటో డ్రైవర్‌ను రాంగ్‌రూట్‌లో వచ్చిన క్రేన్ ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరం అంబర్‌పేటకు చెందిన లాలూ(32) ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కిరాయి నిమిత్తం హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తుండగా మనోహరాబాద్ మండలం కాళ్ళకల్ జాతీయ రహదారి 44పై మొరాయించింది. దీంతో ఆటోను పక్కకు నిలిపి స్పేర్ పార్ట్స్ కోసం రోడ్డుదాటి తిరిగి ఆటో వద్దకు వెళ్తున్న క్రమంలో రాంగ్‌రూట్‌లో వచ్చిన క్రేన్ లాలూను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. క్రేన్ డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంతో నడపడం వల్లే ప్రమాదం చోటుచేసుకుందని సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తన సిబ్బందితో ప్రమాద స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పేద ప్రజలకు అండగా సీపీఐ



జెండా ఆవిష్కరిస్తున్న చాడ వెంకటరెడ్డి

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

బెజ్జంకి(సిద్దిపేట) : సామ్రాజ్యవాద, భూస్వామ్య పెట్టుబడుదారులకు వ్యతిరేకంగా పేద ప్రజల కోసం పోరాటాలు చేసిన ఘనత సీపీఐ పార్టీకే ఉందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సీపీఐ 99వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా బుధవారం నిర్వహించిన వేడుకల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. పేద ప్రజలకు అండగా ఉండేందుకు, మతతత్వ పార్టీలకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు చేపట్టామని వివరించారు. దున్నేవాడిదే భూమి నినాదంతో లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన ఘనత సీపీఐదన్నారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సీపీఐ నాయకుడు ధర్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమాల్లో పార్టీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సృజన్ కుమార్, మల్లేశ్, బొనగిరి మహేందర్, రూపేశ్, మధు, శివకృష్ణ, మహేశ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు



మాట్లాడుతున్న సుదర్శన్‌రావు

దుబ్బాకటౌన్ : 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని తొలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రావు అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలో 1969 తెలంగాణ ఉద్యమకారుడు దివంగత శ్రీరాం ప్రభాకర్ స్వగృహంలో నివాసంలో తెలంగాణ తొలి దశ ఉద్యమకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలో విద్యార్థి దశలో చురుగ్గా పాల్గొని జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రం ఏర్పాటుకు స్ఫూర్తిని ఇచ్చింది 1969 తొలి దశ ఉద్యమమేనన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తొలిదశ ఉద్యమకారులను గుర్తించి సహాయం చేయాలన్నారు. సమావేశంలో తొలిదశ ఉద్యమకారులు శ్రీరాం తిలక్ చందర్, యాదగిరి గౌడ్, జిందం గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వ్యవసాయ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): ఆరు నెలల వ్యవసాయ విద్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజ్ఞాన జ్యోతి డైరెక్టర్ అర్జునరావు, ఫీల్ కో ఆర్డినేటర్ జగదీశ్ బుధవారం తెలిపారు. మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యసంస్థ వ్యవసాయ కళాశాలలో జనవరి మొదటి వారంలో ప్రారంభమయ్యే ఆరు నెలల ఉచిత వ్యవసాయ శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన పదవ తరగతి చదివి, 15 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు. సంవత్సర ఆదాయం రూ.లక్షలోపు ఉన్న వ్యవసాయ కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆరు నెలల శిక్షణ సమయంలో విద్యాబోధనతోపాటు భోజనం, హాస్టల్ వసతి ఉచితంగా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత గ్రామాల్లో వ్యవసాయం చేయడంతోపాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఉత్సాహవంతులు ఈనెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 81850 60769, 81062 55535 సంప్రదించాలని తెలిపారు.